సాక్షి
తూర్పుగోదావరి
మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025



ధరణీ రక్షతి రక్షితః

సకల జీవరాశులకూ ఆధారమైన ఈ ధరిత్రి ప్రమాదంలో ఉంది. కోటాను కోట్ల జీవులు నిన్న బాగా బతికాయి. నేడు ప్రమాదంలో పడ్డాయి.


8లో



సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలంటూ ధర్నా

కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు.

డెల్టాలకు 4,900 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 4,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 900, మధ్య డెల్టాకు వెయ్యి, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.30 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి



ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది సమయ పాలన కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర వైద్యశాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐసోలేషన్ వార్డును పరిశీలించిన అనంతరం మాతా శిశు సంరక్షణ వార్డు, క్రిటికల్ కేర్ బ్లాక్ పనుల పురోగతిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎం.లక్ష్మీ సూర్యప్రభను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఐసోలేషన్ వార్డును పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

మాతా శిశు ఆరోగ్య సంరక్షణ వార్డును తగిన వైద్య సేవలు అందించేందుకు సిద్ధం చేసుకోవాలని సూచించారు. మాతా శిశు ఆరోగ్య బ్లాక్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని గత సమావేశంలోనే స్పష్టం చేశామని గుర్తు చేశారు. 15 రోజుల్లో ఈ బ్లాక్ ద్వారా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వ బోధన ఆసుపత్రికి అనుసంధానంగా క్రిటికల్ కేర్ బ్లాక్ ద్వారా ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించే విధంగా పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వివిధ వైద్య సేవలు, మానవ వనరుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అర్జీల పరిష్కారం అసంబద్ధంగా ఉంటే చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రజల అర్జీల పరిష్కారంలో అసంబద్ధంగా ఎండార్స్‌మెంట్ ఇవ్వడం సరికాదని, అలా చేసినట్లు గమనిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి పలువురు జిల్లా అధికారులతో కలిసి ఆమె అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి, అర్జీల పరిష్కారంపై ఆదేశాలు జారీ చేశారు. పీజీఆర్ఎస్, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా వస్తున్న అర్జీలు స్వీకరించి, తగిన పరిష్కారం చూపాలని అన్నారు. ఏదో ఒక సమాధానం ఇస్తే పరిష్కరించినట్లు కాదని స్పష్టం చేశారు. ఇదే తీరు పునరావృతమైతే ఉపేక్షించే ప్రసక్తే లేదని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతురాలు మల్లిం వెంకటేశ్వరికి ఉమా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యాన జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా మంజూరైన రూ.8,500 విలువ చేసే వీల్ చైర్‌ను జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అందజేశారు.

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 30 అర్జీలు



అర్జీదారు సమస్య వింటున్న ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం రూరల్: తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఎస్పీ డి.నరసింహ కిషోర్ ప్రజల నుంచి 30 అర్జీలు స్వీకరించారు. సివిల్, చీటింగ్, కొట్లాట, దొంగతనం, కుటుంబ సమస్యలు తదితర కేసులకు సంబంధించి ప్రజలు ఫిర్యాదులు చేశారు. వారి సమస్యలను ఎస్పీ స్వయంగా అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. బాధితులకు చట్ట పరిధిలో, నిర్దేశిత సమయంలో సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ (అడ్మిన్), ఏవీ సుబ్బరాజు (శాంతిభద్రతలు) తదితరులు పాల్గొన్నారు.

నన్నయ.. మిన్నయ్యేనా!

- 2006 ఏప్రిల్ 22న వర్సిటీ ఏర్పాటు
- నేడు 20వ వసంతంలోకి..
- పెద్ద వర్సిటీగా గుర్తింపు
- అభివృద్ధికి కలసికట్టుగా పని చేయాలంటున్న వీసీ
- నేడు నన్నయ విశ్వవిద్యాలయం ఆవిర్భావ దినోత్సవం



ఆదికవి నన్నయ యూనివర్సిటీ

రాజానగరం: తెలుగు రాష్ట్రాలలో అతిపెద్ద యూనివర్సిటీగా విరాజిల్లుతున్న ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఏర్పడి నేటికి 19 సంవత్సరాలు పూర్తవుతున్నాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రజల చిరకాల కోరిక మేరకు అప్పటి మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు కృషితో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో సాంస్కృతిక, సాహిత్య రాజధానిగా పేరొందిన రాజమహేంద్రవరంలో ఆదికవి నన్నయ పేరిట 2006 ఏప్రిల్ 22న ఈ విశ్వవిద్యాలయం ఏర్పడింది. దీని ఆవిర్భావం కోసం గోదావరి జిల్లాల వాసులు, రాజకీయ నాయకులు ఎన్నో పోరాటాలు చేయాల్సి వచ్చింది.

నాక్ గుర్తింపు పొందినా..

రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఆవిర్భవించిన ఈ యూనివర్సిటీ కొద్ది కాలంలోనే అక్కడి నుంచి వెలుగుబందలో జాతీయ రహదారిని ఆనుకుని సేకరించిన 98 ఎకరాల సువిశాల ప్రాంగణంలోకి అడుగు పెట్టింది. సొంత భవనాలు నిర్మించుకోగలిగింది. 12బితో పాటు నాక్ గుర్తింపును కూడా అందుకుంది. కానీ ప్రభుత్వపరంగా సరైన సహకారం లేక విద్యార్థులకు అవసరమైన పూర్తి స్థాయి బోధన సదుపాయాలు పొందలేకపోతోంది. 2018లో చేపట్టిన కొన్ని భవనాల నిర్మాణాలు నిధుల లేమితో నిలిచిపోగా ఇటీవల వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ చొరవతో ఆ పనులు పునఃప్రారంభమయ్యాయి.

శాశ్వత అధ్యాపకులేరీ!

యూనివర్సిటీ క్యాంపస్‌లో కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, బీఈడీ కళాశాలలు ఉన్నాయి. వీటితో పాటు కాకినాడ, తాడేపల్లిగూడెంలో రెండు క్యాంపస్‌లు, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 390 అనుబంధ కళాశాలలు ఉన్నాయి. తద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్ద యూనివర్సిటీగా పేరు పొందింది. వర్సిటీ పరిధిలో సుమారు 1.85 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే వర్సిటీ క్యాంపస్‌లో మాత్రం విద్యార్థులకు పాఠాలు బోధించే అధ్యాపకులు పూర్తి స్థాయిలో లేకపోవడం పెద్ద లోటుగా ఉంది. చాలావరకూ అడ్‌హాక్, కాంట్రాక్టు అధ్యాపకులతోనే తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామంటూనే 19 సంవత్సరాలు పూర్తి చేశారు. ఫలితంగా విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఆది నుంచీ ఆటుపోట్లే..

ఆది నుంచీ నన్నయ వర్సిటీ అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటూనే ఉంది. సిబ్బందిలో నెలకొన్న వర్గవైషమ్యాలతో నిత్యం ప్రచార మాధ్యమాలకెక్కుతోంది. సిబ్బందిలో ఏర్పడిన వర్గాలు విద్యార్థులను పావులుగా ఉపయోగించుకుంటున్నాయనే విమర్శలు కూడా ఉన్నాయి. పని చేసే వారికంటే విధులు ఎగ్గొట్టేవారే ఇక్కడ ఎక్కువగా ఉన్నారనే ఆరోపణలు కూడా లేకపోలేదు. రాజకీయ అండదండలతోనే వారు ఇలా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

ఎన్నో వివాదాలు

యూనివర్సిటీలో విద్యార్థినులకు సరైన రక్షణ ఉండటం లేదు. నిరంతరం అభద్రతా భావంతోనే కాలం గడుపుతున్నారనే ఆరోపణలున్నాయి. ఐదేళ్ల క్రితం ఆంగ్ల విభాగంలో విద్యార్థినుల పట్ల ఒక ఆంగ్లోపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన వర్సిటీ ప్రతిష్ఠకు మాయని మచ్చగా మిగిలిపోయింది. ఆ కేసు ఏమైందో తెలియకుండానే మరో హాస్టల్లో మత్తు పదార్థాల వివాదం. దీనికి తోడు నాణ్యత లేని, పురుగులు పట్టిన ఆహారం పెడుతున్నారంటూ విద్యార్థులు రోడ్డెక్కిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

పర్మినెంట్ ఫ్యాకల్టీని నియమించాలి



పెద్ద యూనివర్సిటీ అనే పేరే గానీ పర్మినెంట్ ఫాక్యల్టీ లేరు. అడ్‌హాక్, కాంట్రాక్టు ఫ్యాకల్టీ ఎక్కువగా ఉన్నారు. అధ్యాపక ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలి. కారణాలేవైనా ఇక్కడ అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇంటర్నల్ ఎగ్జామ్స్ సమయంలో ల్యాబ్స్ సమస్య ఎక్కువగా వస్తోంది. దీనికోసం బయటకు వెళ్లాల్సిన దుస్థితి. పూర్తి స్థాయి ల్యాబ్ సదుపాయం ఉండాలి. విద్యార్థినుల విషయమై తరచూ ఏదో ఒక సమస్య వస్తోంది. వారికి అభద్రతా భావం ఏర్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. పాలన, పర్యవేక్షణ సవ్యంగా ఉంటేనే అన్ని సమస్యలూ నియంత్రణలోకి వస్తాయి.

– అశోక్‌కుమార్, ఎస్ఎఫ్ఐ ప్రతినిధి, రాజమహేంద్రవరం

వర్సిటీ ప్రగతికి అందరూ పని చేయాలి



యూనివర్సిటీ ప్రగతి కోసం అందరూ పని చేయాలి. అలాగైతేనే ఇక్కడ ఉంటారు. పని చేయకుండా ఆడుకుంటే ఉపేక్షించేది లేదు. పరిపాలన నాకు కొత్త కాదు. చిందరవందరగా ఉన్న వలకు మాట్లు వేసి, సరిచేసే ప్రయత్నంలో ఉన్నాను. వర్గాలు, వైషమ్యాలు విడనాడి వర్సిటీ అభివృద్ధికి అంతా ఒక కుటుంబంగా పని చేయాలనేదే నా సంకల్పం. అందుకనే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేయదలిచాం. ఇప్పటి వరకూ ఎలా ఉన్నా, ఇకపై అంతా ఒక్కటిగా ఉండాలని కోరుతున్నా.

– ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ, వైస్ ఛాన్సలర్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ

చంద్రబాబు భూసంతర్పణ పేరిట అక్రమాలు



మాజీ మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: చంద్రబాబు అధికారంలోకి వచ్చారంటేనే భూసంతర్పణ పేరిట అక్రమాలు జరుగుతాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ విమర్శించారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. విశాఖలో టీసీఎస్‌కు ఎకరా 99 పైసలకు కేటాయించడాన్ని అడ్డం పెట్టుకుని ఉర్సా కంపెనీకి భూమిని ధారాదత్తం చేస్తూ, కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను పైసలకు అప్పగించే అధికారాన్ని ప్రజలు చంద్రబాబుకు ఇవ్వలేదన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరగాలని అన్నారు. ప్రజలకిచ్చిన హామీలను ఇప్పటి వరకూ నిలబెట్టుకోలేని చంద్రబాబు భూ అక్రమాలకు పాల్పడటం దారుణమని వేణు విమర్శించారు.

నేర నియంత్రణకు డ్రోన్‌లతో నిఘా

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, నేరాలు నియంత్రణకు డ్రోన్ కెమెరాలతో నిఘా పెంచనున్నామని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణకు ఉపయోగిస్తున్న డ్రోన్ కెమెరాల వినియోగంపై జిల్లా పోలీస్ కార్యాలయంలో సిబ్బందికి సోమవారం నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. నేరాలు జరిగేందుకు ఆస్కారమున్న పాడుబడిన ఇళ్లు, తోటలు, బహిరంగ ప్రదేశాలు, పార్కులు, గోదావరి నదీ తీరం వెంబడి డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా పెడతామని చెప్పారు.

బహిరంగంగా మద్యం తాగడం, గంజాయి వినియోగం, పేకాట నిర్వహణ, ఈవ్ టీజింగ్, చైన్‌స్నాచింగ్, దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టామని వివరించారు.

పీ–4 సమన్వయానికి ఐదుగురు సభ్యులు

- ఇన్‌చార్జి మంత్రి రామానాయుడు
- డీఆర్‌సీ సమావేశంలో పలు అంశాలపై చర్చ



డీఆర్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పేదరిక నిర్మూలనకు ఉద్దేశించిన పీ–4ను సమన్వయం చేయడానికి ప్రతి నియోజకవర్గంలో ఐదుగురు సభ్యులను నియమిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అర్హుల గుర్తింపు, జాబితా రూపకల్పనలో ఎటువంటి అలక్ష్యం చూపరాదని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లో సోమవారం జరిగిన జిల్లా సమీక్ష కమిటీ (డీఆర్‌సీ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రులు రామానాయుడు, కందుల దుర్గేష్ మాట్లాడుతూ, వరదల సమయంలో సైతం ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇసుక అందించేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక రీచ్‌ల వద్ద అనధికార లావాదేవీలు జరగకుండా చూడాలని సూచించారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, ప్రతి నియోజకవర్గంలో రెండు చొప్పున ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. గోపాలపురం నియోజకవర్గంలో మైనర్, మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి హేతుబద్ధమైన సర్వే జరగలేదని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటువంటి ప్రతిపాదనలు చేసినపుడు స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయం తెలుసుకోవాలని అన్నారు. మన బడి – మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా డి.ముప్పవరం స్కూలును మరో ప్రాంతంలోకి మార్చడం ఇబ్బందికరంగా ఉందని మంత్రి దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. సమావేశంలో ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, జ్యోతుల నెహ్రూ, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, ఎస్పీ డి.నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, నగరపాలక సంస్థ కమిషనర్ కేతనగార్గ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పీజీ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): భారత క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యాన ఎమ్మెస్సీ స్పోర్ట్స్ కోచింగ్ (2025–27), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులు, స్పెషలైజేషన్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సంబంధిత ధ్రువపత్రాలతో వచ్చే నెల 2వ తేదీలోగా https://www.ssc.nsnis.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అనపర్తిలో దౌర్జన్యకాండపై సమగ్ర విచారణ

- వైఎస్సార్ సీపీ నేతల డిమాండ్
- ఎస్పీని కలసిన మాజీ మంత్రి వేణు, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, సూర్యనారాయణరెడ్డి



ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్న వైఎస్సార్ సీపీ నేతలు చెల్లుబోయిన వేణు, జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: అనపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఆయన అనుయాయులు దౌర్జన్యకాండ, దుశ్చర్యలకు పాల్పడుతున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్‌కు వైఎస్సార్ సీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి, మాజీ ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డిలు ఎస్పీని సోమవారం ఆయన కార్యాలయంలో కలిశారు. అనపర్తి నియోజకవర్గంలో కూటమి నేతల దౌర్జన్యకాండపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరగకుండా, పౌర జీవనానికి ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు.

అనంతరం మాజీ మంత్రి వేణు విలేకర్లతో మాట్లాడుతూ, అనపర్తి నియోజకవర్గంలో కూటమి ఎమ్మెల్యే, ఆయన అనుయాయులు దౌర్జన్య కాండలు, దుశ్చర్యలకు పాల్పడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో ఇటీవల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడులను ఎస్పీకి వివరించామని చెప్పారు. దాడి జరిగినా పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడానికి భయపడే పరిస్థితి నెలకొందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మృదుస్వభావి, హింసకు తావు లేకుండా పరిపాలించిన నేత అని, ప్రభుత్వానికి, శాంతిభద్రతలకు సహకరించే వ్యక్తి అని అన్నారు. దీనిని ఎమ్మెల్యే, ఆయన అనుయాయులు చేతకానితనంగా తీసుకోరాదని హితవు పలికారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమని, వాటి నిరూపణ కోసం రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితి సృష్టించడం దారుణమని అన్నారు.

దౌర్జన్యాలు మితిమీరుతున్నాయి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, అనపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఆయన అనుయాయుల దుశ్చర్యలు, కక్షసాధింపు చర్యలు, దౌర్జన్యాలు మితిమీరిపోతున్నాయని అన్నారు. ఎన్నికల ముందు, తరువాత చిన్నచిన్న వివాదాలుంటాయని సర్దుకుపోతూంటే వారి ఆగడాలు శృతి మించుతున్నాయని చెప్పారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డికి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఫోన్ చేసి, 'చేసిన ఆరోపణలు నిరూపించడానికి నువ్వు మా ఇంటికి వస్తావా.. లేక నేను మీ ఇంటికి రానా?' అంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని అణగదొక్కాలని ప్రయత్నిస్తున్నారన్నారు. తాత్కాలికంగా కొంత మందికి పార్టీ కండువాలు వేసినప్పటికీ, నియోజకవర్గంలోను, రాష్ట్రంలోను వైఎస్సార్ సీపీ అభిమానులకు కొదవ లేదని చెప్పారు. మీ హనీమూన్ పిరియడ్ అయిపోయిందని, కార్యకర్తలు, నాయకులపై దౌర్జన్యాలకు పాల్పడితే సహించేది లేదని, ప్రజల నుంచి తిరుగుబాటు ఏవిధంగా తీసుకొస్తామో చూడటానికి సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని హెచ్చరించారు. సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆయన కుమారుడు మనోజ్‌రెడ్డి, వారి అనుచరుల నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ ఎస్పీకి ఫిర్యాదు చేశామని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాల్సిందిగా కోరామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీయూసీ నాయకులు అడపా వెంకట రమణ, అడపా అనిల్, తోట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తల్లి ఒడికి చేరిన తనయ

- పరంధామానికి చేరిన శ్రీరాముడు
- ముగిసిన ఉత్తరకాండ ప్రవచన సప్తాహం



ప్రవచనానికి హాజరైన ప్రజలు



సామవేదం షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): చతుర్విధ పురుషార్థ సాధనకు రామాయణాన్ని మించిన కావ్యం లేదని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఎన్ని కావ్యాలున్నా, వాటిలో అత్యుత్తమమైనది రామాయణమేనన్నది బ్రహ్మవాక్కు అని చెప్పారు. స్థానిక టి.నగర్‌లోని హిందూ సమాజంలో ఉత్తరకాండపై వారం రోజులుగా ఆయన నిర్వహిస్తున్న ప్రవచనాలు సోమవారం ముగిశాయి. ముగింపు ప్రవచనంలో రామావతార పరిసమాప్తిని వివరించారు. ''గోమతీ నదీ తీరాన రాముడు అశ్వమేధ యాగం చేస్తున్న సమయంలో వాల్మీకి మహర్షి ఆనతి మేరకు లవకుశులు రామకథను గానం చేశారు. వారు తన కుమారులేనని రాముడు గుర్తించాడు. సీతపై లోకాపవాదు తొలగించడానికి అశ్వమేధ యాగం జరుగుతున్న తరుణం సరైన సమయమని గుర్తించాడు. ఎందరో రాజులు, మహర్షులు, రాక్షస, వానర వీరులు తరలి వచ్చారు. వారందరి సమక్షాన సీతమ్మ శపథ పూర్వకంగా తన పాతివ్రత్యం నిరూపించాలని ఆయన వాల్మీకి మహర్షిని కోరాడు. మరుసటి రోజు ఉదయం బ్రహ్మదేవుని అనుసరించి వస్తున్న వేదమాతలా, వాల్మీకి మహర్షిని సీతాదేవి అనుసరించి అక్కడికి చేరుకుంది. 'రామా! నా వేలాది సంవత్సరాల తపస్సు మీద ఆన పెట్టి చెబుతున్నాను. సీతాదేవి శుద్ధచరిత, నిష్కళంక' అని ఆయన ప్రజల సమక్షంలో రామునితో చెప్పాడు. 'మహర్షీ! సీతాదేవి పాతివ్రత్యం నాకు తెలుసు. లోకాపవాదు తొలగించడానికి నేను ఇటువంటి కోరిక కోరుతున్నాను' అని రాముడు బదులిచ్చాడు. 'త్రికరణశుద్ధిగా నేను రాముని తప్ప అన్యులను స్మరించలేదు. ఇది సత్యమైతే భూదేవి నన్ను తనతో తీసుకు వెళ్తుంది' అని సీతమ్మ శపథం చేస్తుంది. సీత మాట పూర్తయిన వెంటనే దివ్య సింహాసనం మీద భూదేవి వచ్చి సీతాదేవిని రసాతలంలోకి తీసుకు వెళ్లింది. 'సాగరం ఆవల ఉన్న సీతాదేవిని తీసుకు వచ్చిన నాకు సీతను వెంటనే అప్పగించకపోతే, ధరాతలాన్ని నాశనం చేస్తాను' అని రాముడు ప్రకటించాడు. బ్రహ్మాది దేవతలు రామునితో సాంత్వన వచనాలు పలికి ఆయన నిగ్రహించారు'' అని సామవేదం వివరించారు. ''ప్రజారంజకంగా 11 వేల సంవత్సరాలు పరిపాలించిన రాముని వద్దకు కాలపురుషుడు వచ్చాడు. 'నీతో ఒక రహస్యం మాట్లాడాలి. ఈ సమయంలో ఎవరూ మన వద్దకు రారాదు' అని ఆయన చెబుతాడు. రాముడు లక్ష్మణుడిని పిలిచి, 'మా సమావేశం అయ్యేంత వరకూ ఎవ్వరినీ పంపవద్దు. నా ఆజ్ఞను ఉల్లంఘించినవాడు నా చేతిలో వధ్యుడు' అని చెబుతాడు. అయితే, దుర్వాస మహర్షిని ఆపలేకపోవడంతో మహర్షుల సూచనపై లక్ష్మణునికి మరణంతో సమానమైన బహిష్కరణను రాముడు విధించాడు. సీత లేని రాముని ఊహించవచ్చును. 'లక్ష్మణుడు లేని రాముని ఊహించలేము'' అని సామవేదం అన్నారు. 'కాలపురుషుని ద్వారా బ్రహ్మ సందేశాన్ని తెలుసుకున్న రాముడు సరయూ నది ద్వారా పరంధామానికి చేరుకున్నాడు. అంతకు ముందే ఆయన బహిష్కరించిన లక్ష్మణుడు పరంధామానికి చేరుకున్నాడు' అని షణ్ముఖ శర్మ చెప్పారు. ఈ ప్రవచనాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

క్లుప్తంగా

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి


యాండ్ర సత్యనారాయణ (ఫైల్)

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న యాండ్ర సత్యనారాయణ(64) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడని ఇన్‌చార్జి ఏపీవో వీరబాబు తెలిపారు. గ్రామంలో ఉపాధి హామీ పనిచేస్తుండగా గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడని 'ఉపాధి సిబ్బంది ఎమ్.ధనలక్ష్మీ సమాచారం అందించడంతో ఘటనా ప్రదేశానికి వెళ్లి వైద్య సిబ్బందితో పరీక్షలు చేయగా మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు. మృతుడికి గతంలో భార్య మరణించగా, ఇద్దరు కుమారులు ఉన్నారు.

టెన్త్ ఫలితాలు మనమిత్ర, లీప్ మొబైల్ యాప్‌లో..

రాయవరం: పదవ తరగతి పరీక్షా ఫలితాలు బుధవారం ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. అభ్యర్థులు ఫలితాలను https://bse.ap.gov.in, https://apopenschool.ap.gov.in/ వెబ్‌సైట్లతో పాటుగా, మనమిత్ర(వాట్సాప్), లీప్ మొబైల్ యాప్‌లో అందుబాటులో ఉంటాయి. వాట్సాప్ నంబరు 95523 00009కు హాయ్ అని మెసేజ్ పంపి, విద్యా సేవలను ఎంచుకోవాలి. అనంతరం ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఎంచుకుని, అభ్యర్థి రోల్ నంబరు నమోదు చేయడం ద్వారా విద్యార్థులు పది ఫలితాల పీడీఎఫ్ కాపీని పొందే వీలుంటుంది.

ధరణీ రక్షతి రక్షితః

- భూరక్షణపై ప్రభుత్వాల నిర్లక్ష్యం
- ప్రతిఘటిస్తున్న ప్రజలు
- నేడు ధరిత్రీ దినోత్సవం


కాకినాడ విద్యుత్ నగర్‌లో చెత్తలో ఆహార పదార్థాలు తింటున్న ఆవులు

కపిలేశ్వరపురం: సకల జీవరాశులకూ ఆధారమైన ఈ ధరిత్రి ప్రమాదంలో ఉంది. కోటాను కోట్ల జీవులు నిన్న బాగా బతికాయి. నేడు ప్రమాదంలో పడ్డాయి. రేపు... ? ఈ ప్రశ్నకు సమాధానం కచ్చితంగా మనిషే చెప్పాలి. తన అవసరాలు కోసం అనివార్యమంటూ విచ్చలవిడి వినియోగంతో ధరిత్రిని ప్రమాదంలోకి నెట్టాడు. అందులోనే తాను నలిగిపోతూ జీవకోటి ఉనికినే ప్రశ్నార్థకం చేశాడు. ఈ ధరణిని మనం కాపాడితే అదే మనలను రక్షిస్తుందన్న విషయాన్ని మరచిపోతున్నాడు. ఆహ్లాదకరమైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకి సైతం పర్యావరణ పరంగా ముప్పు పొంచి ఉంది. నేడు ధరిత్రీ దినోత్సవం సందర్భంగా ఈ కథనం...

నేపథ్యమిదీ...

84 లక్షల జీవరాశులున్న భూమిపై మానవులు సాగిస్తున్న విధ్వంసాన్ని ఆపాలన్న లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి శ్రద్ధ వహించింది. ధరిత్రీ దినోత్సవాన్ని జరుపుకొంటూ ఆ సంస్థ సూచనలపై చర్చలు, సమావేశాలు, సమీక్షలు జరుపుతున్నారు. 2023లో ఎర్త్ డే థీమ్‌గా 'మన గ్రహం కోసం ఖర్చు చేయండి' అనే నినాదంతోనూ, 2024లో ప్లానెట్ వెర్సస్ ప్లాస్టిక్ అనే నినాదంతో కృషి చేసింది. ఈ ఏడాది 'అవర్ పవర్, అవర్ ప్లానెట్' నినాదంతో ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనుంది.

పోగుపడుతున్న చెత్తతో పర్యావరణానికి విఘాతం

నాలుగు లక్షల జనాభా కలిగిన జిల్లా కేంద్రమైన కాకినాడలో రోజుకు 140 టన్నులు, రాజమహేంద్రవరంలో 145 టన్నులు, అమలాపురంలో 38 టన్నుల చెత్త తయారవుతోంది. సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లో రోజుకు సుమారుగా 28 టన్నులు చొప్పున, ఏలేశ్వరం నగర పంచాయతీలో 8 మెట్రిక్ టన్నుల చెత్త పోగుపడుతోంది. 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ వస్తువులు ప్రమాదకరం. పాలిథీన్ సంచులు, ఇతర వస్తువుల రీసైక్లింగ్ చేసేందుకు వీలుపడదు. ప్లాస్టిక్ బాటిళ్లు 450 ఏళ్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగ్‌లు వెయ్యి సంవత్సరాలు వరకూ భూమిలో కరగవు. ప్రపంచంలో దాదాపు 700 జాతులు ప్లాస్టిక్‌కు ప్రభావితమై అంతరించే దశలో ఉన్నాయి. శరీరంలోకి వెళ్లిన సూక్ష్మ స్థాయిలో ఉండే ప్లాస్టిక్ పాలిమర్ అవశేషాల వల్ల క్యాన్సర్, చర్మ , హార్మోన్లకు సంబంధించిన వ్యాధులొస్తాయి. ప్లాస్టిక్ పుల్లలు, ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ట్రేలు, ఫోర్కులు, చెంచాలు, ప్లాస్టిక్ స్వీట్ బాక్సులు, బడ్స్, బెలూన్లు, క్యాండీ, కత్తులు, అలంకరణకు వాడే థర్మోకోల్, ఆహ్వాన పత్రాలు, సిగరెట్ ప్యాకెట్లు, 100 మైక్రాన్ల లోపు ఉండే పీవీసీ బ్యానర్లు నిషేధ జాబితాలో వున్నాయి.

ప్రమాదభరితంగా పారిశ్రామిక ఉద్గారాలు

తూర్పుగోదావరి జిల్లాలో 38 మధ్య తరహా పరిశ్రమలు, కాకినాడలో 62, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఏడు మధ్య తరహా పరిశ్రమలున్నాయి. వాటికి తోడు అనేక చోట్ల భారీ పరిశ్రమలున్నాయి. హేచరీలు, పరిశ్రమలు విడుదల చేసే విషపూరితమైన రసాయనాలు సముద్రంలోకి చేరి గోదావరి, సముద్ర జలాలను కలుషితం చేస్తున్నాయి.

అడుగంటుతున్న భూగర్భజలాలు

అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఆక్వా సాగుతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. తాగునీరు కలుషితమైపోతోంది. మెట్ట ప్రాంతాల్లో సాగు నీరందక ఎత్తిపోతల పథకాలతో నీరందిస్తున్నారు. గోదావరి తీరాన ఉన్నప్పటికీ తాగునీటి సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి.

కాలుష్యానికి బలవుతున్న జీవరాశులు...

కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో సూక్ష్మ, అతి సూక్ష్మ ధూళి కణాలు తీవ్రత ఎక్కువ. కాకినాడ జిల్లాలో జనవరి నెలలో 220 సముద్ర తాబేళ్లు మృతి చెందాయి. కొత్తపల్లి మండల పరిధిలోని తీర ప్రాంతంలో సముద్ర జలాలు కలుషితం కారణంగా సముద్ర తాబేళ్లు తరచూ మృత్యువాత పడుతూ ఒడ్డుకు చేరుకుంటున్నాయి. గతేడాది కోనసీమ జిల్లాలో సుమారు 984 ఆలివ్ రిడ్లే తాబేళ్లు 1,02,740 గుడ్లను పెట్టాయి. వాటి నుంచి వచ్చిన 71,388 పిల్లలను సముద్రంలో వదిలారు.

ఆక్వాతో అన్నీ సమస్యలే...

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఉప్పునీటి చెరువుల్లో 20,110 ఎకరాల్లోనూ, మంచినీటి చెరువుల్లో 44,199 ఎకరాల్లోనూ ఆక్వా సాగు జరుగుతోంది. 201 రొయ్యల హేచరీలు, 13 ప్రాసెసింగ్ యూనిట్లు, నాలుగు ఫీడ్ మిల్లులు ఉన్నాయి. వీటి నుంచి పర్యావరణ సమస్యలు రావడమే కాకుండా మూడు పంటలు పండే భూములు ఆక్వా చెరువులుగా మారిపోతున్నాయి. ఆక్వా సాగుతో భూమి సారం దెబ్బతింటోంది.

వైఎస్సార్ సీపీ హయాంలో ధరిత్రి రక్షణ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ధరిత్రీ రక్షణకు విశేష కృషి చేసింది. 2022 జూలై 1 ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ చట్టం తీసుకొచ్చింది. క్షేత్ర స్థాయిలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చింది. ఫలితంగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ 2020లో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 51వ ర్యాంకును సాధించింది. 2021లో 41, 2022లో 97, 2023లో 59వ ర్యాంకులను పొందింది. మండపేట తదితర పురపాలక సంఘాలు సైతం ధరిత్రీ రక్షణలో గుర్తింపు పొందాయి.

నిర్లక్ష్యంగా కూటమి ప్రభుత్వం

ధరిత్రీ పరిరక్షణ పట్ల కూటమి సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఉప్పాడ సముద్ర కోత నివారణకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ద్వారా పరిశీలన జరిపి సుమారు రూ.2వేల కోట్లతో కోత నివారణతో పాటు, తీరాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దుతానంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన మాట నీటిమూటయ్యింది. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పచ్చని పంట పొలాలను ఆక్వా జోన్‌గా మార్చేందుకు చేసిన ప్రయత్నాలను ప్రజలు ప్రతిఘటించారు. పలు గ్రామ సభల్లో ఆక్వా జోన్ మాకొద్దంటూ తీర్మానాలు చేశారు.

పర్యావరణ హితమైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వైవిధ్య భరితమైంది. దేశం నలుమూలలకూ మొక్కలను సరఫరా చేసే కర్మాగారంగా కడియం నర్సరీలు నడుస్తున్నాయి. కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లికి చెందిన సుమారు 400 కుటుంబాలు 40 ఏళ్లుగా పలు రాష్ట్రాల్లో నర్సరీలను నిర్వహిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4.36 లక్షల ఎకరాల్లో వరి సాగుతో ఆహార ఉత్పత్తి చేస్తున్నారు. 161 కి.మీ. సాగరతీరం, 297 కి.మీ. గోదావరి నదీ పరివాహక ప్రాంతం ఉంది. కాకినాడ సమీప కోరంగి మడ అడవులు ప్రకృతి వైపరీత్యాల నుంచి జిల్లాను కాపాడుతున్నాయి. మడ అడవుల్లో 272 రకాల పక్షి జాతులు, 610 రకాల మత్స్య జాతులున్నాయి. గోదావరి సముద్ర కలిసే ప్రాంతంలో 300 రకాల చేపలుండటమే కాకుండా ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంతానోత్పత్తికి నిలయం. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని చిత్తడి నేలలు ఆహార క్షేత్రాలు కావడంతో శీతాకాలంలో జొన్నాడకు వందల సంఖ్యలో సైబీరియా నుంచి 1,600 కిలోమీటర్లు ప్రయాణించి బార్ హెడెడ్ గుస్‌గా పిలిచే వలస బాతులు సంచరిస్తుంటాయి. ఆటుపోట్లు, పౌర్ణమి సమయంలో రాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ ఆలివ్‌రిడ్లే గుడ్లు పెట్టేందుకు వస్తుంటాయి.

విఘాతానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పర్యావరణ విఘాతానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఆక్వా సాగుతో ముప్పు వాటిల్లుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నప్పటికీ ఆక్వా జోన్లు ఏర్పాటు చేస్తామంటూ గ్రామసభలను నిర్వహించడం ప్రజా వ్యతిరేకమే. పర్యావరణ పరిరక్షణ చట్టాలను నిర్వీర్యం చేసే పాలనపై ప్రజలు తిరగబడే రోజు వస్తుంది.

– కేవీవీ సత్యనారాయణ, కన్వీనర్, రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ సబ్ కమిటీ, జనవిజ్ఞాన వేదిక అనుబంధం, యానాం

విద్యార్థి జీవితంలో పుస్తకానికి ప్రాధాన్యం



సభలో మాట్లాడుతున్న ప్రముఖ విద్యావేత్త అమలారాయ్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రతి విద్యార్థి జీవితంలో పుస్తకం ప్రాధాన్యం కలిగి ఉంటుందని ప్రముఖ విద్యావేత్త అమలారాయ్ పేర్కొన్నారు. కాకినాడ సురేష్‌నగర్ శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో సోమవారం 2024–25 విద్యాసంవత్సరంలో విద్యతో పాటు పలు విభాగాల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం పేరుతో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అమలారాయ్ మాట్లాడుతూ విద్య అంటే తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పినది వినడం, పుస్తకాలు పఠనం చేయడం మాత్రమే కాదని, మానసిక వికాసం కోసం ఉల్లాసం కోసం మనం ఆడే ఆటలు, పాటలు అన్నీ విద్యాభ్యాసమేనన్నారు. నేటి కాలంలో విద్యాభ్యాసం కేవలం మార్కులు, ర్యాంకులు సాధనే ధ్యేయంగా మారిందని, ఇటువంటి సమయంలో విద్యతో పాటు సమానంగా వారికి అభిరుచి ఉన్న క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు శ్రీ ప్రకాష్ యాజమాన్యం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ ప్రకాష్ మాట్లాడుతూ విద్యాబోధన కంటే చదువుపై ఆసక్తిని కలిగించడం విద్యాసంస్థల ప్రథమ కర్తవ్యమన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన వారికి స్మార్ట్ షేక్స్పియర్, సూపర్ స్పీల్‌బర్గ్, రాకింగ్ రామానుజన్, పద్యయోధ టైటిల్స్ అందజేశారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలంటూ ధర్నా


ధర్నా చేస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

కాకినాడ సిటీ: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. 2024లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు 59 విభాగాలుగా 176 హామీలు ఇచ్చిందన్నారు. వాటిలో పెన్షన్, అరకొర గ్యాస్ పథకం తప్ప మరేమీ అమలు చేయలేదని విమర్శించారు. విద్యార్థులకు, యువజనులకు, నిరుద్యోగులకు, మహిళలకు, కార్మికులకు, వివిధ వృత్తులు, కులాల వారీగా అమలు చేస్తామన్న పథకాలు ఏవీ అమలు చేయలేదని ఆరోపించారు. ముందు దగా, వెనుక దగా, కుడిఎడమల దగాదగా అన్న చందంగా చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఉందని ఆందోళనకారులు విమర్శించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, మైనారిటీ, రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు చంద్రబాబు ప్రభుత్వం తల ఊపుతూ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందన్నారు. రెండున్నర లక్షల పెన్షన్ల కోత విధించి, పెన్షన్ పెంచి అమలు చేస్తున్నట్టు ఈ ప్రభుత్వం పోజు కొడుతోంది తప్ప ఆచరణలో పెన్షన్లు పెరిగింది లేదని విమర్శించారు. మొదటి దఫా గ్యాస్ పథకం అరకొర అమలు చేశారు తప్ప పూర్తిగా అమలు చేయలేదని, ఉచిత బస్సు ఊసేలేదన్నారు. నిరుద్యోగ భృతి మాటేలేదని, అమ్మకు వందనం, మహిళా శక్తి రైతు భరోసా, వలంటీర్లకు రూ.10 వేలు జీతం ఇవి కూడా అమలు చేయలేదన్నారు. ఇల్లులేనివారికి గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల భూమి ఇస్తానన్న పథకానికి నేటికీ శ్రీకారం చుట్టలేదని విమర్శించారు. ఉపాధి హామీ కూలీలకు నిధులు విడుదల కావడంలేదన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ నాయకులు జె.వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, ఎం ఏసు, రాగుల రాఘవులు, జి బాలరాజు, జి రాజ్‌కుమార్, బొడ్డు సత్యనారాయణమూర్తి, జి దుర్గారావు, చిన్న, శ్రీను, కెవిరమణ, సతీష్ పాల్గొన్నారు.

మోటారు సైకిళ్లు ఢీకొని ఒకరి మృతి

మరో ఇద్దరికి గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216పై పటవల పైడా కళాశాల సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో మహమ్మద్ అలీషా(44) మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు కాకినాడకు చెందిన మొహమ్మద్ అలీషా, మహమ్మద్ జహంగీర్ కలిసి ద్విచక్రవాహనంపై ముమ్మిడివరంలోని ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి వేస్తుండగా, పైడా కళాశాల సమీపంలో ఎదురుగా వెళుతున్న మరొక బైక్‌ను ఢీకొనడంతో రెండు వాహనాలపై ప్రయాణిస్తున్నవారు కింద పడిపోయారు. ఈ ఘటనలో మహమ్మద్ అలీషా తలకు తీవ్రగాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. కాగా జహంగీర్‌తోపాటు మరొక బైక్‌పై వెళుతూ వెనుక కుర్చున్న మహిళకు కూడా గాయాలైనట్లు ఎస్సై తెలిపారు. వీరిని 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

ఖండవల్లి రోడ్డు ప్రమాదంలో ఒకరు..

ఇద్దరికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో మృతి చెందిన సతీష్‌కుమార్

పెరవలి: జాతీయ రహదారిపై పెరవలి మండలం ఖండవల్లి సెంటర్‌లో ఆదివారం రాత్రి కారు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒక యువకుడు మృతి చెందగా ఇద్దరు యువకులు తీవ్ర గాయాలు పాలయ్యారు. పెరవలి ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ గ్రామానికి చెందిన నేకూరి రాజ్ కిరణ్, ఈతకోట శ్రీనివాస్, కొనుకు సతీష్ కుమార్ (23) మోటార్ సైకిల్‌పై ఖండవల్లి వస్తుండగా సెంటర్‌లో రోడ్డు దాటే క్రమంలో రావులపాలెం నుంచి తణుకు వైపు వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో వెనుక కూర్చున్న సతీష్‌కుమార్ మోటార్ సైకిల్ పైనుంచి ఎగిరి 10మీటర్ల దూరంలో పడడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ఒక యువకుడికి చేయి జారిపోవడంతో అతనిని మెరుగైన వైద్యం కోసం మంగళగిరి పంపించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో...


దుర్గా శ్యాంప్రసాద్ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య నందిని

తాళ్లరేవు: మండల పరిధిలోని జి.వేమవరం పంచాయతీలో పెంకే దుర్గా శ్యాంప్రసాద్(35) విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందాడు. కోరంగి ఎస్సై పి.సత్యన్నారాయణ తెలిపిన వివరాల మేరకు జి.వేమవరంలోని సానబోయిన ఆదినారాయణకి చెందిన మల్లితోటలో శ్యాంప్రసాద్ కొంతకాలంగా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే మల్లితోటకు నీరు పెట్టేందుకు విద్యుత్ మోటారు వేసే క్రమంలో విద్యుత్ వైరు స్విచ్ బోర్డులో పెడుతుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్యాంప్రసాద్ మృతదేహం వద్ద భార్య నందిని కుటుంబ సభ్యులు బోరున విలపించడం అక్కడివారిని కలిచివేసింది. నందిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యన్నారాయణ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సుమారు నెలరోజులకు బయటపడిన వైనం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీహరిరావు

కొవ్వూరు: మద్దూరులంక గ్రామంలో పల్లెపాలెంలో ఆకుల కృష్ణారావు అనే రైతుకి చెందిన మకాం సమీపంలో చిత్రాపు వెంకట్రావు మృతదేహాన్ని గుర్తించారు. సుమారు నెల రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చునని రూరల్ పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం పూర్తిగా ఎండిపోయి ఎముకలు మాత్రమే మిగిలాయి. రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఆరునెలలు క్రితమే మృతుడు వెంకట్రావు భార్య రామజ్యోతి తొమ్మిది నెలలు గర్భవతిగా ఉన్న సమయంలో గుండెపోటుతో మృతి చెందారు. అప్పటి నుంచి వెంకట్రావు ఒంటరిగా ఉంటున్నారు. గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం ఉన్నట్టు ఎస్సై చెప్పారు. ఆమె ఇటీవల హైదరాబాద్ వెళ్లిపోయింది. వెంకట్రావు తల్లిదండ్రులు పదిహేనేళ్ల కిత్రమే మృతి చెందారు. దీంతో తన సోదరుడు ఒక పోర్షన్‌లోను వెంకట్రావు మరో పోర్షన్‌లోను నివాసం ఉంటున్నారు. అన్నదమ్ములిద్దరూ మాట్లాడుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఘటనా స్థలంలో లభ్యమైన మొబైల్ ఫోన్ ఆధారంగా శవం వెంకట్రావుది అని నిర్ధారించారు. మార్చి 20వ తేదీన చివరి కాల్ చేసి ఉన్నట్లు ఎస్సై తెలిపారు. ఘటనా స్థలంలో లభ్యమైన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహానికి సమీపంలోనే గుళికలు డబ్బా ఉండడాన్ని బట్టి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. వెంకట్రావు ఆత్మహత్యకు పాల్పడ్డారా? ఎవరైనా హత్య చేశారా? అన్న అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. దీంతో అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీహరిరావు తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	18,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

యువతి అదృశ్యం

సీతానగరం: మండలంలోని వంగలపూడికి చెందిన ఇంటర్మీడియట్ చదివిన పద్దెనిమిదేళ్ల అమ్మాయి కనిపించడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ వాసంశెట్టి శ్రీను సోమవారం తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటలకు నిద్ర లేంచి లేచి చూడగా తన అమ్మాయి కనిపించలేదని వంగలపూడికి చెందిన తల్లి కొత్తపల్లి శ్రీదేవి సోమవారం సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ శ్రీను తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

తొండంగి: ఆర్థిక ఇబ్బందుల కారణంగా పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తొండంగి మండలం ఏ.కొత్తపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన విశ్వనాథుల చిన్న(35) ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది ఆదివారం రాత్రి ఇంటి మేడపై పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతనిని చూసి కుటుంబ సభ్యులు తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దీనిపై తొండంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుదాఘాతానికి విద్యార్థి మృతి


సిద్ధార్థమౌర్య (ఫైల్)

యానాం: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి తదుపరి ఉన్నతవిద్యను అభ్యసించడానికి సిద్ధపడుతున్న తరుణంలో విధి వక్రించింది. విద్యుత్ ప్రమాదంతో ఆ విద్యార్థిని కానరానిలోకాలకు తీసుకువెళ్లిపోయి ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే యానాం పట్టణ పరిధిలో బెజవాడ గార్డెన్స్‌కు చెందిన లంక సిద్దార్థమౌర్య (18) సోమవారం ఇంట్లో ట్యూబ్‌లైట్ బిగిస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. ఈ నేపథ్యంలో అపస్మారక స్థితిలోఉన్న అతనిని స్థానిక జీజీహెచ్‌కు తరలించారు. అయితే చికిత్స అందించినప్పటికీ సిద్దార్థ మృతి చెందడం విషాదాన్ని నింపింది. మృతుని తండ్రి లంక చినలోవరాజు ఇటీవలి సీనియర్ అకౌంట్ ఆఫీసర్‌గా చేసి రిటైర్డ్ కాగా, తల్లి లక్ష్మీ యానాం జీజీహెచ్‌లో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. మృతుడు సిద్దార్థమౌర్య కాకినాడ ఆదిత్య కాలేజీలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పూర్తిచేసుకుని కళాశాలలో ద్వితీయ స్థానాన్ని సాధించాడని తెలిపారు. చదువులో ఎంతో చురుకుగా ఉండే సిద్దార్థ మౌర్య అకాల మృతి అందరినీ కలచి వేసింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్ట్

తుని: యువతకు గంజాయి సరఫరా చేస్తోన్న నలుగురు నిందితులను అరెస్ట్ చేశామని తుని పట్టణ సీఐ ఎం.గీతారామకృష్ణ సోమవారం తెలిపారు. తునిలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు ఉప్పరగూడెం కాలనీలో ముమ్మర తనిఖీలు నిర్వహించి ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తుని పట్టణం అమ్మాజీపేటకు చెందిన పగడం శివ సంతోష్ ఏజెన్సీలో గంజాయి కొనుగోలు చేసి తునికి తీసుకువచ్చి బత్తాయితోట వీధికి చెందిన పిట్టా నాగ సత్య మహేష్, అమ్మాజీపేటకు చెందిన మనసాని వెంకటేష్ ద్వారా స్థానికంగా గంజాయి విక్రయిస్తున్నారన్నారు. వీరు ఉప్పరగూడెంకు చెందిన షేక్ ఉమా గౌరి వద్ద నిల్వ చేశారన్నారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించారని సీఐ తెలిపారు.